క్లుప్తంగా

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన బిల్ల తిరుపతి ఐదు నెలల క్రితం రూ.10500 విలువ చేసే సెల్ ఫోను పోగొట్టుకగా వెంటనే వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడికి మొబైల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిషానుల ఊరేగింపు



కొత్తగూడలో ఊరేగిస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో గురువారం గొంతెమ్మ నిషానులను వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో డప్పుచప్పులు, యువకుల నృత్యాలతో పోతరాజుల విన్యాసాలతో లక్ష్మీదేవరా, గౌరిగొడ్డు, నిషాలను ఊరేగించారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం గొంతెమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి మానెపల్లి రాజన్న తెలిపారు.

పీవీటీజీల స్థితిగతులపై సర్వే



అవగాహన కల్పిస్తున్న నరేశ్

కెరమెరి: మండలంలోని 23పీవీటీజీ (ప్రిమిటీవ్ వల్నెరెబుల్ ట్రైబుల్ గ్రూప్స్) ఉన్న గ్రామాల్లో గురువారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు సర్వే చేపట్టారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల వివరాలు, రేషన్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, ఎపిక్ కార్డులు వంటి గురించి ఇంటి యజమానులతో వివరాలను తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో పీఎం జన్‌మన్ పథకం కింద ఆయా గ్రామాల్లో గృహాలు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, డీడీ రమాదేవి ఆదేశాలతో గ్రామీణులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఎస్సీఆర్‌పీ నరేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు గోకుల్ గ్రామ పటేళ్లు ఉన్నారు.

రికార్డులు నమోదు చేయాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఎన్‌వో

కెరమెరి: రికార్డులు విధిగా నమోదు చేయాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా గురువారం మండలంలోని పెద్ద సాకడ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం సుర్పం రమేశ్ ఉన్నారు.

గ్రామసభల పరిశీలన



ప్రజాపాలన గ్రామసభలో నాయకులు

బెజ్జూర్: మండలంలోని బెజ్జూర్ పంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్దన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుస శంకర్ యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆత్రం రాజారాం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హకీమ్, మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శైలేష్ చారి, తొర్రం వినోద్, మొర్ల గంగు, దుర్గం దాసు, విష్ణు, మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల ఫలితాల్లో 48మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాధా రేష్మి జయన్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చలిగుప్పిట కెరమెరి

- కమ్ముకుంటున్న పొగమంచు
- పిల్లలకు నిమోనియా వచ్చే అవకాశం
- నానాటికీ పెరుగుతున్న చలి తీవ్రత

కెరమెరి: పక్షం రోజులు నుంచి.. చలి తీవ్రత పెరిగింది. 'దుప్పటి కప్పుకున్నా వణుకు ఆగడం లేదు'. మార్నింగ్ వాక్ చేసేవారు కాస్త తగ్గించుకున్నారు. ఇటీవల చలి తీవ్రత పెరగడంతో ప్రజలు బయటికి రావడానికి జంకుతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు మార్కెట్లో స్వెట్టర్లు, మంకి క్యాప్‌లు, మఫ్లర్లు కొనుగోలు చేయడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. యువత కూడా లేటెస్ట్ ట్రెండ్ దుస్తులతో చలికే వణుకు పుట్టిస్తున్నారు. మండలం చుట్టురా అభయారణ్యాలు, పెద్ద పెద్ద వృక్షాలు ఉండడంతో జిల్లాలోని అన్ని మండలాలకంటే కెరమెరిలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

పది రోజులుగా తీవ్రత..

ఐదురోజుల నుంచి చలి తీవ్రత రోజురోజుకూ పెరగడమే కాకుండా ఉదయం 8గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. తెల్లవారు జామున రోడ్లపై వచ్చే వాహనాలు లైట్లు వేసి రాక తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. మంచు ప్రభావం తీవ్రంగా ఉండడంతో వాహనదారులు జంకుతున్నారు. వచ్చే నెలకూడా చలితీవ్రత ఇలాగే ఉండే అవకాశం లేకపోలేదు. వైద్యుల సలహాల మేరకు జాగ్రత్తలు పాటిస్తే శీతాకాలంలో వచ్చే వ్యాధులు నుంచి దూరంగా ఉండే అవకాశముంది. పిల్లలను ఉదయం చలికి తీసుకువస్తే నిమోనియా వంటి ప్రమాదకరమైన వ్యాధి సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.



మంటలతో ఉపశమనం పొందుతున్న ఆదివాసీలు

చిన్నారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చలిలో చిన్న పిల్లలను బయటికి తీసుకురావద్దని వైద్యులు చెబుతున్నారు. జలుబుతో పాటు దగ్గు, నియోనియా వచ్చే అవకాశముందని, చలికి స్ట్రెప్టొ వ్యాధి సోకే అవకాశాలు అధికంగా ఉన్నాయని వారంటున్నారు. చిన్న వయస్సు పిల్లల శరీరం మొత్తం ఉన్ని దుస్తులతో కప్పి ఉంచాలని, సాధ్యమైనంత వరకు ఉదయం 9 గంటల తర్వాతే పిల్లలను బయటికి తీసుకువెళ్లాలని చెబుతున్నారు. చల్లని పదార్థాలు తినిపించకూడదని, వేడినీళ్లతో స్నానం చేయించాలని, చర్మం పగలకుండా వ్యాసిలిన్ పట్టించాలని, చిన్న పిల్లలను మట్టిలో ఆడుకోనివ్వవద్దని సూచిస్తున్నారు. ఆరుబయట చలిలో నిద్రపోకూడదు. ప్రయాణాలు చేసేవారు మందంగా ఉండే జర్కిన్లు ధరించాలి.

చుట్టూ నీరే..

మండలానికి చుట్టూర నీరు ఉండడం వల్ల ఇక్కడ చలి తీవ్రత అధికంగా ఉంటుంది. కెరమెరికి పడమర వైపు అమ్మన్నమడుగు ప్రాజెక్టు, తూర్పు భాగంలో కొమురం భీం ప్రాజెక్టు, ఉత్తరం వైపు కల్లెగాం ప్రాజెక్టు, పార్ధ చెరువులతో పాటు చిన్నచిన్న చెరువులు ఉండడం వల్ల మండలమంతా చల్లటి వాతావరణం ఉంటుంది. వేసవి కాలంలో అదే మోతాదులో ఎండలు కూడా ఉండడం గమనార్హం!



కెరమెరిని కప్పిన మంచు దుప్పటి

పిల్లలను జాగ్రత్తగా ఉంచాలి



చలికాలంలో పెద్దలు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి. చలితీవ్రత పెరిగినప్పుడు జలుబు, దగ్గు, నిమోనియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయి. వీటితో పిల్లలకు చాలా ప్రమాదకరం. ఈ సూచనలు కన్పించిన వెంటనే డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

\- సుధాకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

రాంపూర్ బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీకి మంజూరైన బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి పురుషోత్తం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా రాంపూర్ గ్రామ ప్రజలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. గత పాలకులు గ్రామాలనికి కనీసం 2కిలోమీటర్ల మేర రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేకపోయారని అన్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారే రోడ్డుపై విద్యార్థులు కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు. అత్యవసర సమయంలో గ్రామానికి 108 అంబులెన్స్ వచ్చేందుకు కూడ వీలులేకుండా రోడ్డంతా పూర్తి బురదమయంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా రోడ్డు వేయాలని లేకుంటే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శివ, క్రిష్ణలు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



దహెగాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: అభయహస్తం కింద ప్రజాపాలన గ్రామసభల్లో ఆరు గ్యారంటీ పథకాల కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని కుంచవెల్లి, మొట్లగూడ, రాంపూర్, కల్వాడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కుంచవెల్లి ప్రజాపాలనలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు పాల్గొన్నారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సర్పంచు రౌతు భాగ్యలక్ష్మి ఉన్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని మోతుగూడ, అప్పపల్లిల్లో నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎంపీడీవో శశికళతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఎపీవో చంద్రశేఖర్, సర్పంచ్ సువర్ణ, ఉపసర్పంచ్ రజిత, కార్యదర్శి రాందాస్, నాయకులు ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బురదగూడెం, ఎస్‌జీఓఎస్ కాలనీల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, ఎంపీవో ఉన్నారు.



కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్

ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి

కెరమెరి: గ్రామంలోని ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. మండలంలోని మెట్టపిప్రి, ఇందాపూర్, పార్ధ, గోండ్‌గూడ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొని ఆయన మాట్లాడారు. కుటుంబానికి సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తోందని, 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలనలో సమస్యలను రాసి ఇవ్వాలని చెప్పారు. సర్పంచ్‌లు, డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తామని వివరించారు. రోడ్లు నిర్మించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పీపీరావు ప్రాజెక్టు కాల్వలు కూరుకపోయి సాగునీరు అందడం లేదని వివరించారు. కాల్వల మరమ్మత్తులు చేయించి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. 108మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంబగొని సులోచన, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, తహసీల్దార్ కవిత, సహకార సంఘం చైర్మన్ కొంద్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్,ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పొంచి ఉన్న ప్రమాదం..

దహెగాం: మండలంలోని కల్వాడ గ్రామం వద్ద రోడ్డుపై నుంచి అడ్డంగా విద్యుత్ తీగలు గ్రామ పంచాయతీ కార్యాలయంపై నుంచి ఉండడం, తీగలు వేలాడుతున్నందున లోడ్‌తో వెళ్లే వాహనాలకు తీగలు తగులుతున్నందున పంచాయతీ అధికారులే విద్యుత్ తీగలు వేలాడకుండా రెండు కర్రలు ఏర్పాటు చేసి తీగలను పైకి లేపారు. గాలి వీస్తే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న తీగలను పైకి లేపాలని స్థానికులు కోరుతున్నారు.



తీగలు వేలాడకుండా కర్రలతో ఇలా..

రాములోరి అక్షింతలు పంపిణీ



వాంకిడి: అక్షింతలు కలుపుతున్న భక్తులు

లింగాపూర్: అయోధ్యలోని శ్రీరామ మందిర అక్షింతలను గురువారం మామిడిపల్లి గ్రామపంచాయతీ వంజారిగుడా గ్రామం నుంచి గ్రామస్తులు కాలినడకతో మండల కేంద్రానికి శ్రీరామ సంకీర్తన, భజన కార్యక్రమాల మధ్య తీసుకెళ్లారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రతీ ఇంటింటికి అక్షింతలు, రామమందిర చిత్రపటాలను అందజేయనునట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభిస్తున్నందున భక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పూజారి నాథురాం పాండురంగ్, సుదర్శన్, వెలువాక శ్రీకాంత్‌చారి, జాదవ్ వినోద్, విరణ్, మంగులాల్ మహారాజ్ ఉన్నారు.

8న శోభాయాత్ర

కెరమెరి: ఈ నెల 8న మండల కేంద్రంలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, గ్రామ పెద్దలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉదయం 11గంటలకు కెరమెరి శివాలయానికి సర్పంచ్‌లతో పాటు గ్రామాల్లోని పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని కోరారు. శివాలయం నుంచి నెహ్రూనగర్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయం వరకు అక్షింతల కలశాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కెరమెరితో పాటు అనేక గ్రామాలకు చెందిన ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, కెరమెరి వ్యాపారులు, నాయకులు ఉన్నారు.



కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని ఆలయంలో ఉంచారు. అనంతరం భక్తులంతా కలిసి అక్షింతలను కలిపారు. సర్పంచ్ పెందుర్ పవన్, ఎంపీటీసీ హిడ్మే ప్రవీణ్ పాల్గొన్నారు.

మూసి ఉన్న దరఖాస్తుల స్వీకరణ కేంద్రం



సిబ్బందిలేని ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రం

కాగజ్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమం చేపట్టగా కొందరు కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గురువారం మోసం గ్రామ పంచాయతీలోని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం మూసి ఉంది. దీంతో కొంత మంది దరఖాస్తు చేయకుండా వెనుదిరగాల్సి వచ్చిందని పలువురు పేర్కొన్నారు. దరఖాస్తు స్వీకరించేందుకు ప్రతీ గ్రామపంచాయతీకి ఒక ప్రత్యేకాధికారి, గ్రామకార్యదర్శితో పాటు అంగన్‌వాడీ, ఈజీఎస్, ఐకెపీ ఉద్యోగులను కేటాయించారు. గురువారం మధ్యాహ్న సమయంలో మోసం గ్రామపంచాయతీలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో ఎవరూ కూడా లేకపోవడం గమనార్హం. ఈ విషయమై ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్‌ను సంప్రదించగా విచారణ చేపడతామన్నారు.

ఆన్‌లైన్ చేయించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాపాలన దరఖాస్తులను క్రమబద్ధీకరణతో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా పాదుక దర్శనం



పూజలు చేస్తున్న పూజారులు



పాల్గొన్న భక్తులు

కౌటాల: కౌటాల మినీ స్టేడియంలో గురువారం నిర్వహించిన పాదుక దర్శనం, ఉపాసక్ దీక్షా కార్యక్రమం కనుల పండువగా సాగింది. మహారాష్ట్రలోని నాణీజ్ థామ్‌కు చెందిన జగద్గురు నరేంద్రచార్య మహారాజ్ సిద్ధ పాదుకల దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నెలరోజులుగా జిల్లాతో పాటు సమీప మహారాష్ట్రలో భక్తులు కరపత్రాలు, గోడపత్రులతో ప్రచారం నిర్వహించడంతో జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నాణీజ్‌థామ్ నుంచి బుధవారం సాయంత్రం మండల కేంద్రానికి నరేంద్ర మహారాజ్ పాదుకలు చేరుకున్నాయి. గురువారం ఉదయం స్థానిక రామాలయం నుంచి మినీస్టేడియం వరకు ప్రత్యేక రథంలో నరేంద్ర మహారాజ్ పాదుకలను స్టేడియంలోని సభ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక వేదమంత్రాలతో పూజలు చేశారు. భక్తులతో మినీ స్టేడియం జనసంద్రంగా మారింది. ఎస్సై ఎన్ మధుకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మంగళహారతులతో మహిళలు

భక్తిభావంతో జీవించాలి: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

ప్రతీఒక్కరు భక్తిభావంతో జీవించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం కౌటాల మినీస్టేడియంలో నిర్వహించిన నరేంద్రబాబా పాదుక దర్శనం కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు మిథున్, రవి, తిరుపతి, మధుకర్, చందు, వసంత్, నిర్వాహకులు పాల్గొన్నారు.

'ప్రాణహిత'తో సాగునీరు అందిస్తాం

కౌటాల: ప్రాణహిత ప్రాజెక్ట్ పూర్తి చేసి బీడు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచిస్తుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం కౌటాల రైతు వేదికలో ఆయన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని, ప్రతీ సమస్యపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకాలను ప్రజలకు అందేలా అధికారులు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు వానుపటేల్, ప్రధాన కార్యదర్శి మిథున్, నాయకులు చందు, మధుకర్ ఉన్నారు.

డార్ఫ్ వర్ధంతి కరపత్రాల ఆవిష్కరణ

జైనూర్: ప్రొఫెసర్ డార్ఫ్ దంపతుల వర్ధంతికి రావాలని కోరుతూ హైమన్‌డార్ఫ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కనక వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని మార్లవాయి గ్రామంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రతీ గూడా నుంచి ప్రజలు వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ, ఏపీవో నగేష్, ఏపీఎం సుజాత, మార్లవాయి, సర్పంచ్ ప్రతిభ ఉన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చట్టాలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జైనూర్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను ఉల్లఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల అధికారులు గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న కార్యకలాపాలకనుగుణంగా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్, ఆదివాసీ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు భగవంత్‌రావు, నాయకులు మారుతీ, తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

రెబ్బెన: తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటిశాఖ ఆధ్వర్యంలో గురువారం గోలేటి గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న పథకాలపై కళాకారులు మ్యాజిక్ షో, పాటల ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అనంతరం బ్రాంచి మేనేజర్ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, క్యాషియర్ సురేష్, బ్రాంచి సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, క్రిష్ణ పాల్గొన్నారు.